నర్సరీలపై వేసవి ప్రభావం

- వేడి తీవ్రతకు వాడిపోతున్న మొక్కలు
- కాపాడేందుకు సిబ్బంది పడరాని పాట్లు


ఐలాపురంలో నర్సరీని పర్యవేక్షిస్తున్న ఎంపీఓ వీరారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ ప్రభుత్వం హరిత హారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు పట్టణ, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక నర్సరీలు, పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలపై ప్రస్తుతం వేసవి ప్రతాపాన్ని చూపుతుంది. నియోజకవర్గంలో వారం పది రోజులుగా రికార్డు స్థాయిలో అధిక ఉష్ణోగ్రత నమోదు అవుతున్నాయి. దీంతో ఎండల నుంచి నర్సరీల్లోని మొక్కలను కాపాడేందుకు పట్టణాల్లో మెప్మా సిబ్బంది, గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతిరోజు రెండు పూటలు ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు పోస్తున్నప్పటికీ వడగాలులకు మొక్కల బెడ్లు గంటలోనే తడారిపోతున్నాయి. మొక్కల రక్షణ కోసం ఏర్పాటు చేసిన గ్రీన్‌షేడ్ నెట్స్ సైతం ఎండల తీవ్రతను ఆపలేకపోతుంది. దీంతో కొన్ని మొక్కలు వాడిపోతుండగా మరి కొన్ని మొక్కలు మాత్రం మొక్క దశలో తట్టుకోలేకపోతున్నాయి.

కాగా నర్సరీలు, పకృతి వనాలను మున్సిపాలిటీలో పర్యావరణ ఇంజనీర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓల ఆధ్వర్యంలో మండల పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మొక్కలు వాడిపోకుండా అప్రమత్తం చేస్తున్నారు.

మొక్కలను కాపాడేందుకు సిబ్బంది పాట్లు..

నియోజకవర్గ పరిధిలోని అడవిదేవులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ, మాడుగులపల్లి, వేములపల్లి, మండలాలతో పాటు మున్సిపాలిటీలో మొత్తం 148 నర్సరీలను ఏర్పాటు చేశారు. ఆయా నర్సరీల పరిధిలో పెద్ద మొత్తంలో మొక్కలను పెంచుతున్నారు. గత రెండు నెలల క్రితం నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ప్రారంభం కాగా ప్రస్తుతం మొక్కలు మాత్రం ఏపుగా పెరుగుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బెడ్స్‌ల్లో మొక్కలను పెంచుతుండగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీళ్లు పట్టుతూ సిబ్బంది కాపాడుతున్నారు. ఎండకు చనిపోయిన మొక్కల స్థానంలో ఇతర మొక్కలను పెంచేందుకు ప్రైమరీ బెడ్స్‌లో పెంచుతున్న చిన్న మొక్కలతో పాటు బెడ్స్‌లోని మొక్కలు ఎండకు చనిపోతున్నాయి.

ప్రకృతి వనాల్లో ఇదే పరిస్థితి..

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలతో పాటు పట్టణంలోని ప్రకృతి వనాల్లోని మొక్కలు కూడా ఎండ తీవ్రతకు తట్టుకోలేక చనిపోతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న వేడితో హరితహారం మొక్కలు, నర్సరీల్లో పెరుగుతున్న మొక్కల సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజు మొక్కలకు తప్పకుండా నీరు అందించాలని, చనిపోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు.

మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు



నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలకు ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు అందిస్తూ బెడ్లల్లో తడి ఆరిపోకుండా చూస్తున్నాం. ఇటీవల ఈదురుగాలులకు కొన్ని గ్రామాల్లో గ్రీన్‌షెడ్ నెట్స్‌లు ఎగిరిపోవడంతో తిరిగి ఏర్పాటు చేశాం. అదే విధంగా ఎండిపోయిన మొక్కల స్థానంలో తిరిగి కొత్త మొక్కలను నాటాం. రోజురోజుకు ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. దీంతో పల్లె పకృతి, నర్సరీల్లో సిబ్బందిని అప్రమత్తం చేశాం.

– గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీడీఓ, మిర్యాలగూడ

మొక్కల సంరక్షణపై నిరంతరం పర్యవేక్షణ



మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నర్సరీలు, పట్టణ పకృతి వనాలకు ప్రత్యేకంగా ఒకరికి ఇన్‌చార్జ్ ఇవ్వడం జరిగింది. నర్సరీలపై వారు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నర్సరీల్లో ప్రతి రోజు మొక్కలకు నీరు పోయించి వాడి పోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. నర్సరీల్లో మొక్కలు చనిపోతే వాటి స్థానంలో మరో కొత్త మొక్కనూ ఏర్పాటు చేసి హరితహారం కార్యక్రమానికి అన్ని మొక్కలు సిద్ధంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

– రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే నోముల భగత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : నియోజకవర్గంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నోముల భగత్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జూన్ 2 నుంచి 22వరకు జరిగే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ఘన కీర్తిని చాటి చెప్పేలా సాగర్ నియోజకవర్గంలో సంబరాలు జరపాలన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దూళిపాల రామచంద్రయ్య, బీఆర్‌ఎస్ వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, రవినాయక్, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, మున్సిపల్ వైస్‌చైర్మన్ నల్లగొండ సుధాకర్, మార్కెట్ వైస్ చైర్మన్ రామలింగయ్య, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరిక

హాలియా : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. త్రిపురారం మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, నిడమనూరు, హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, త్రిపురారం మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, రామచంద్రయ్య, ఎంపీటీసీ ధర్మారెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యుత్ అధికారులతో సమీక్ష..

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే నోముల భగత్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో ఎక్కడ లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా అదనపు సర్వీస్ లైన్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

హాలియా : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) సర్వీసును క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అనుముల మండల జేపీఎస్ నాయకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నోముల భగత్‌ను శాలువాతో వారు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ పెద్దులు, వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, సైదులు, వెంకన్న, రియాజ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ పరిధిలోని బాబుసాయిపేట రోడ్డులో గల మోడల్‌స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 30వతేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ భూరుగు నిర్మల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు tsms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ 40, బీపీసీ 40, సీఈసీ 40, ఎంఈసీ 40 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంతో పాటు పదోతరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను మోడల్‌స్కూల్‌లో అందిచాలని సూచించారు.

కారోబార్ల సంఘం మండల కమిటీ ఎన్నిక


కోట్ల సతీష్ మండల అధ్యక్షుడు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో కారోబార్ల సంఘం జేపీసీ మండల కమిటీ సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందుగుల ప్రవీణ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోట్ల సతీష్, ప్రధాన కార్యదర్శిగా పొట్ట లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా గుండాల వెంకటయ్య, ట్రెజరర్‌గా చిలువేరు వెంకటయ్య, కార్యదర్శులుగా మునగాల శంకర్, కంబాలపల్లి వెంకటయ్య, మహిళా కార్యదర్శిగా వసుకు అలివేలు తదితరులతో కమిటీని ఎన్నుకున్నారు.

నాలుగేళ్లుగా బీసీలను పట్టించుకోని కేసీఆర్

మిర్యాలగూడ టౌన్ : నాలుగేళ్లుగా బీసీలను పట్టించుకోని సీఎం కేసీఆర్ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీసీలపై ప్రేమ పుట్టి రూ.లక్ష వరకు సబ్సిడీ లోన్లు ఇస్తామని అనడం విడ్డూరంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ యువత లోన్ల కోసం 5.70లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని, ఓటు బ్యాంకు కోసం బీసీలకు రూ.లక్ష లోను ఇస్తామని చెప్పడం మరోసారి మాయ చేయడమేనని అన్నారు. సమావేశంలో అంజియాదవ్, రాంబాబు తదితరులున్నారు.

నందికొండలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం ఏర్పాటు


ప్లాస్టిక్ వస్తువులను సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది, నాయకులు

నాగార్జునసాగర్ : నందికొండలోని హిల్‌కాలనీ మూడో వార్డులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమాన్ని శుక్రవారం ఆ వార్డు కౌన్సిలర్ శిరీషామోహన్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులు వీలైనంత వరకు తగ్గించడం, తప్పనిసరి వస్తువులను పునర్వినియోగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ నిరంజన్, లక్పతి, బాలాజీ, పారిశుధ్య ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజర్‌పై ప్రజాప్రతినిధుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంఈఓ తరి రాము

గుర్రంపోడు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి అధికారులు గైర్హాజర్ కావడంతో పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ, ఉద్యానవశాఖ, ఐకేపీ, ఏఎమ్మార్పీ తదితర శాఖల అధికారులు గైరుహాజరుపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీపీ తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, తహసీల్దార్ హుస్సేన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కుంకుమ బండ్ల ఊరేగింపు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని శ్రీ మహిసాసురమర్ధిని అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ దీపాలతో అలంకరించిన కుంకుమ బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే భాస్కర్‌రావును గెలిపించాలి


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన హరీశ్‌రావు, ఎమ్మెల్యే


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : వచ్చే ఎన్నికల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యేగా నల్లమోతు భాస్కర్‌రావును మరోసారి గెలిపించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. నిన్నమొన్నటి వరకు మిర్యాలగూడ సీటు బీఆర్‌ఎస్, సీపీఎం పొత్తులో భాగంగా సీపీఎంకు ఇస్తారనే ప్రచారం జరిగింది. కాని ఆత్మీయ సమ్మేళనం వేదికపై భాస్కర్‌రావును మరోసారి గెలిపించాలని మంత్రి చేసిన వ్యాఖ్యలతో భాస్కర్‌రావు టికెట్‌కు ఢోకా లేదని తేలిపోయింది. అనంతరం ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ.. మిర్యాలగూడను నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పట్టణంలో ఎన్ఎస్పీ క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారికి జీఓ 59 కింద శాశ్వత హక్కులు కల్పించాలని కోరారు.

సభలో నవ్వులు పూయించిన మంత్రి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావును ఉద్దేశించి చెప్పిన మేనల్లుడి సామెత సభలో నవ్వులు పూయించింది. మిర్యాలగూడ అభివృద్ధికి భాస్కర్‌రావు ఎంతగా కృషి చేస్తున్నాడో ఈ సామెతలో వివరించిన తీరు ఆకట్టుకుంది. జగదీశ్‌రెడ్డి చెప్పిన కథ సారాంశం.. మేనత్త ఇంటికి (ఆమె అన్న కొడుకు) మేనల్లుడు వచ్చాడు. మేనల్లుడు వచ్చాడని మొదటి రోజు మటన్ కూర వంటి పెట్టింది. రెండో రోజు ఇంటిలో ఉన్న నాటుకోడి కోసి వండి వడ్డించింది. రెండు రోజులుగా గడిచినా ఇంకా పోట్లేదు.. తెల్లారింది మూడో రోజు ఉదయం.. అల్లుడా ఇంటి దగ్గర మీ నాయన, అమ్మ ఎదురు చూస్తుంటారు.. రాత్రి వండిన చద్ది అన్నం ఉంది, ఓ కోడి గుడ్డు వండుతా.. అది తిని ఇక మీ ఇంటికి పో అంటుంది మేనత్త. కాని ఆ మేనల్లుడు పర్వాలేదు అత్తా.. చద్ది అన్న తింటాను.. ఆ తరువాత వండే వేడి అన్నం కూడా తిని పోతాను అంటాడు.. అనగానే సభలో నవ్వులు విరిశాయి. అదే విధంగా మీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మిర్యాలగూడ అభివృద్ధికి రూ.4వేల 5వందల కోట్ల నిధులు సాధించడంతో పాటు రూ.40వేల కోట్లతో దామరచర్లలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తూ నియోజకవర్గాన్ని జిల్లాలోనే అత్యధికంగా అభివృద్ధి చేస్తున్నా.. ఇంకా నిధులు కావాలని అడుగుతున్నాడని, అతడి కృషి అమోఘమని సామెత సారాంశాన్ని వివరించారు.

మంత్రులకు స్వాగతం పలికిన శ్రేణులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిలకు స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. పట్టణంలోని ఏడు కోట్ల తండా నుంచి నల్లగొండ రోడ్డు నుంచి రాజీవ్ చౌక్ మీదుగా సాగర్‌రోడ్డు గుండా ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

మిర్యాలగూడ కార్పొరేషన్ స్థాయికి ఎదుగుతుంది

దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్‌పవర్ ప్రాజెక్టు పూర్తయితే మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్పొరేషన్ స్థాయికి ఎదుగుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదే విధంగా ఎన్ఎస్పీ క్వార్టర్స్ నివాసితుల సమస్య సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. దీంతో పాటు ఎమ్మెల్యే భాస్కర్‌రావు కోరిక మేరకు మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆసుపత్రికి సిటీస్కాన్, టిఫా స్కాన్, ఐసీయూ కెపాసిటీ పెంచడంతో పాటు నూతనంగా బ్లడ్ బ్యాంక్‌ను మంజూరు చేస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు.

సమస్యలపై మంత్రి హరీశ్‌రావుకు వినతుల వెల్లువ


మంత్రులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

మాడుగులపల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, ఎంపీపీ గౌరవ సలహాదారు పోకల రాజు శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి త్వరలో నిధుల కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఆర్థికశాఖ మంత్రిని కలిసిన మెప్మా ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మెప్మా ఉద్యోగులకు పే స్కేలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం మెప్మా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఓలు శ్రీనివాస్ ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : ఆటో మోటారు రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మిర్యాలగూడకు వచ్చిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిలకు తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీఆర్ఎస్‌కేవీ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మొహ్మద్ నాజర్ అలీ మీర్జా, మహమూద్ తదితరులున్నారు.

డిప్యూటేషన్ల రద్దుకు మంత్రి ఆదేశం

గుర్రంపోడు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 8మంది వైద్య ఆరోగ్య సిబ్బంది డిప్యుటేషన్ల రద్దుకు ఎమ్మెల్యే నోముల భగత్ శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖామంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యుటేషన్ల రద్దుకు మంత్రి ఆదేశించారని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్


మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిలు హాజరవుతున్న నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పొలగాని వెంకటేశ్ మాట్లాడారు. అరెస్ట్ అయినవారిలో గూడూరు సర్పంచ్ శ్రీనివాస్, రుద్రారం ఎంపీటీసీ ఆవుల దేవేందర్‌రెడ్డి, తక్కెళ్లపాడు మాజీ సర్పంచ్ గుండు నరేందర్‌గౌడ్, కాలువపల్లి మాజీ సర్పంచ్ లింగయ్య, నాగరాజు, శివరామకృష్ణ ఉన్నారు.

మిర్యాలగూడ : నియోజకవర్గంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిల పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం తగదని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాలం వెంకన్నయాదవ్ అన్నారు. శుక్రవారం అరెస్ట్‌లకు నిరసనగా దామరచర్ల మండల కేంద్రంలోని రహదారిపై నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బంటు కిరణ్, అంజిరెడ్డి, నాయకులు సదానందం, మోహన్ నాయక్, నాగునాయక్, దుర్గ, చెన్నయ్య, శ్రీను, కోటిరెడ్డి, గడ్డం సైదులు, నాగరాజు, సైదులు, కిషన్ నాయక్, వేణు, మధు, హుస్సేన్ పాల్గొన్నారు.

వేములపల్లి : మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీను, ఏఎస్ఐ నర్సింహులు కాంగ్రెస్ మండల నాయకులను శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేసి వాడపల్లి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, సెక్రటరి పేరెల్లి నగేష్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టల శ్రీను, మాజీ ఎంపీటీసీ శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


చెక్కులు అందజేస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

హాలియా : అనుముల మండలంలోని పాలెం గ్రామానికి చెందిన కలకొండ నాగయ్య మంగ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారిలో పెద్ద కుమార్తె కావేరి, రెండో కుమార్తె పింకీ. వారి చిన్నతనంలోనే తండ్రి నాగయ్య మృతి చెందడంతో తల్లి మంగ తన ఇద్దరి పిల్లలను పెంచి పోషిస్తుండగా గత ఏడాది ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరి ఆడపిల్లల చదువులకు, కుటుంబ పోషణకు భారంగా మారింది. దీంతో విషయాన్ని తెలుసుకున్న పటాన్‌చెరువు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డి తన 'వన్ చాలెంజ్'ద్వారా వారి ఉన్నత చదువులకు రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేసి బాసటగా నిలిచారు. కార్యక్రమంలో వన్ చాలెంజ్ అడ్వైజర్ సాయికృష్ణ, సభ్యులు జంగారెడ్డి, ముకుందాపురం కార్యదర్శి ఉన్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి


సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చందంపేట : మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పద్మ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులు సద్వినియోగం చేసుకునేలా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమవంతుగా కృషి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పనులు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులకు పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ బాలునాయక్, వైస్ ఎంపీపీ ముత్యాలమ్మ, పీఏసీఎస్ చైర్మన్ బాలయ్య, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మి, తహసీల్దార్ అరుణమ్మ, వైద్యాధికారులు రవి, చందునాయక్, సర్పంచ్‌లు తిరుపతయ్య, బాలమణి, బషీర్, బావోజీ, ఎంపీటీసీ బిక్కునాయక్, నాగునాయక్, ఏట శివరాం తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక కోలాటం



తిరుమలగిరి : మహిళలకు కోలాట సామగ్రి అందజేస్తున్న పాండురంగారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక మహిళా కోలాటమని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన మహిళలకు రూ.50వేలు విలువ చేసే కోలాటం సామగ్రిని ఆయన అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలైన దేపావత్ శ్రీను, ఆంగోతు శ్రీనుల కుమార్తెల వివాహానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఆంగోతు భగవాన్ నాయక్, చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌లు నడ్డి లింగయ్య, ప్రభావతి సంజీవరెడ్డి, నందికొండ కౌన్సిలర్ రామకృష్ణ, ఉప సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన చెన్ను వాసురెడ్డి, దండె సైదులు, రామచంద్రమ్మలు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారికి ఒకొక్కరికి రూ.10వేల చొప్పున, గాలి వెంకటమ్మ కోలాట బృందానికి రూ.15వేలు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి శుక్రవారం ఆర్థికసాయంగా అందజేశారు. అలాగే మండల కేంద్రానికి చెందిన బాధితులకు ఒకొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.50వేలు, అలాగే మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన జింకల అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి క్వింటా బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, తిరుమలగిరి(సాగర్) మండల వైస్‌ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌లు నడ్డి లింగయ్య, ప్రభావతి సంజీవరెడ్డి, శంకర్, నరేష్, లింగారెడ్డి, నందికొండ కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, నాయకులు సత్యం, లక్ష్మయ్య, శ్రీణు, రవినాయక్, శ్రీనివాసాచారి, వెంకట్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ప్రవీణ

చింతపల్లి : మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఎంపీపీ కొండూరు భవానీ, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలో వేసవి దృష్ట్యా ఇప్పటికే తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రాజు, వైస్ ఎంపీపీ యాదయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బియ్యం అందజేత


త్రిపురారం : మండలంలోని కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోగుల ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ శుక్రవారం 100కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ రమేష్‌రెడ్డి, సతీష్ ఉన్నారు.

పాలీసెట్‌లో విద్యార్థుల ప్రతిభ


గిరి ప్రణతి

కొండమల్లేపల్లి : పాలీసెట్ –2023 ఫలితాల్లో మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం మంద సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. 120 మార్కులకు గాను గిరి ప్రణతి 106మార్కులతో 317వ ర్యాంక్, రావుల అనిల్ 104 మార్కులతో 420వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు.

కోమల్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి 122వ ర్యాంకు


కోమల్‌రెడ్డి

వేములపల్లి : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగా కుమారుడైన చింతరెడ్డి కోమల్‌రెడ్డి శుక్రవారం విడుదలైన పాలీసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 122వ ర్యాంకు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పాలీసెట్‌లో రాష్ట్ర స్థాయిలో రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థిని


కట్టా మిథునశ్రీ రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : తండ్రి లేకున్నా.. తల్లి పోషణపై ఎలాంటి కోచింగ్ లేకుండా శుక్రవారం విడుదలైన పాలీసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండు ర్యాంకులను సాధించింది ఓ విద్యార్థిని. పట్టణంలోని ఈదులగూడెంకు చెందిన కట్టా వెంకట్‌రెడ్డి–మాధవి దంపతుల కుమార్తె కట్టా మిథునశ్రీ రెడ్డి ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు గాను 115మార్కులతో రాష్ట్ర స్థాయిలో 30వ ర్యాంకు, ఎం.బైపీసీ విభాగంలో 120 మార్కులకు గాను 114మార్కులతో రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంకును సాధించింది. తన కుమార్తె రాష్ట్ర స్థాయిలో రెండు ర్యాంకులను సాధించడం చాలా ఆనందంగా ఉందని ఆమె తల్లి మాధవి అన్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠ్యపుస్తకాల పంపిణీ

చింతపల్లి : మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవానీ, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ పాల్గొని మాట్లాడారు. డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజు, తహసీల్దార్ విశాలాక్షి, ఎంఈఓ గురువారావు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

దేవరకొండ : వర్షపు నీటిని వృథా చేయకుండా ఒడిసి పట్టుకోవాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అసోసియేషన్ భవనంలో నెహ్రూ యువకేంద్రం నల్లగొండ, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకొని సద్వినియోగం చేసుకోవడంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వర్షపు నీటిని ఎలా ఆదా చేయాలి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాపోలు నిరంజన్, తాళ్ల సురేష్, సుజాత, రాజు, శ్రీను, జగన్, దుర్గేష్ తదితరులున్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

దేవరకొండ : మండలంలోని కొంభీమనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజానగర్‌తండాలో గల నంది విగ్రహాన్ని అపహరించిన దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై తండావాసులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. దుండగులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారిపై సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీసు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేనావత్ నాగార్జున్ నాయక్, కళ్యాణ్‌నాయక్, మోతీలాల్‌నాయక్, ధర్మా, రాము, రమేష్, మోత్య, వెంకటేష్, హరిలాల్, తదితరులు ఉన్నారు.